క్లుప్తంగా

నేటి నుంచి పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ

ఉండి: స్థానిక ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ శుక్రవారం వరకు పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం మల్లికార్జునరావు తెలిపారు. నిపుణులైన పశువైద్య విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా చేపట్టాలనుకునే యువత, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కలెక్టర్ల సదస్సులో నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం వెలగపూడి సచివాలయంలో ఏర్పాటుచేసిన కలెక్టర్ల సదస్సుకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు. 100 రోజుల ప్రణాళిక, పేదల సేవలో కార్యక్రమం, జీరో పావర్టీ, ఈజ్ ఆఫ్ పబ్లిక్ సర్వీసెస్ తదితరాలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశనం చేశారు. రాష్ట్ర ప్రగతికి సమష్టిగా పనిచేద్దామంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సదస్సులో పేర్కొన్నారు.

భీమవరం వన్‌టౌన్ సీఐగా నాగరాజు


ఎం నాగరాజు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ సీఐగా ఎం నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన అడబాల శ్రీను బదిలీ కావడంతో నాగరాజు నియమితులయ్యారు. 2007 బ్యాచ్‌కు చెందిన నాగరాజు ఆర్ఎస్ఐగా గ్రేహౌండ్స్‌లో చేరి తరువాత 2018లో ఎస్సైగా రాజోలు, తొండంగి, మండపేట టౌన్, ఇంద్రపాలెంలో పని చేశారు. 2023లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. తణుకు సీఐగా పనిచేస్తూ బదిలీపై భీమవరం వచ్చారు.

పాలకోడేరు తహసీల్దారుగా భారతి విజయలక్ష్మి


భారతి విజయలక్ష్మి

పాలకోడేరు: మండలం తహసీల్దారుగా నడింపల్లి భారతి విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా ఆకివీడు నుంచి కృష్ణాజిల్లా ఘంటసాల తహసీల్దార్‌గా పనిచేసి సార్వత్రిక ఎన్నికల అనంతరం సాధారణ బదిలీలో భాగంగా పాలకోడేరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ ముత్యాల నాగభూషణం నాయుడు, పలు గ్రామాల వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

రాయితీపై విత్తనాలు అందజేత


ఉప్పులూరులో వరి విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ దుర్గారావు, ఏఓ సంధ్య

ఉండి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక చోట్ల నారుమళ్లు దెబ్బతిన్నాయి. కొత్తగా నారుమళ్లు వేసేందుకు అధికారులు అందిస్తున్న వరి విత్తనాలను ఉప్పులూరు సర్పంచ్ యర్రా దుర్గారావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య సోమవారం రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 89 శాతం రాయితీపై ఎంటీయూ 1153 వరి విత్తనాలను రైతులకు అందిస్తోందని తెలిపారు. రైతులు వీటిని వినియోగించుకుని నారుమళ్లు పోసి వరి సాగుకు ముందడుగు వేయాలని వారు తెలిపారు. ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్,లోకం సుబ్బారావు,వీఏఓ ఎం మహేంద్ర పాల్గొన్నారు.

వాణిజ్య, వ్యాపార రంగాలపైనే దేశాభివృద్ధి

పాలకొల్లు సెంట్రల్: వాణిజ్య, వ్యాపార రంగాలపై ఒక దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఏ దేశమయితే వాణిజ్య పరంగా అభివృద్ధి సాధిస్తుందో ఆ దేశంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ కమర్షియల్ టాక్స్ బీఎస్ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ కామర్స్ దినోత్సవం (కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్) విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం వాణిజ్య రంగంలో ఆధునిక సాంకేతికత ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. దీనికి నిదర్శనం ఈ కామర్స్ డిజిటల్ కామర్స్ సోషల్ మీడియా అని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జగన్మోహన్‌రెడ్డి, కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, కలిదిండి రామరాజు, ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకర్షిస్తున్న టీఎల్ఎం


విద్యార్థులను ఆకర్షిస్తున్న వివిధ టీఎల్ఎంలు


సంక్రాంతి సందర్భంగా పల్లె వాతావరణం నమూనా


రాట్నం నమూనా


సంగీత వాయిద్య పరికరాలు


పందిరి మంచం


బొబ్బిలికోట నమూనా


ఆధునిక అపార్ట్‌మెంట్ భవనం నమూనా



లైట్ హౌస్ మోడల్

- టీఎల్ఎంతో అర్థవంతమైన బోధన చేస్తున్న ఉపాధ్యాయులు
- బాలబాలికల్లో సృజనాత్మక, మనో వికాసానికి దోహదం
- పాఠ్యాంశానికి అనువైన టీఎల్ఎం సిద్ధం చేసి ప్రదర్శన

కాళ్ల: విద్యార్థులకు ఏదైనా విషయాన్ని ఉపన్యాస విధానంలో చెప్తే తొందరగా మర్చిపోతారని ఆలోచనతో అదే విషయాన్ని విద్యార్థులకు ప్రత్యేకంగా వస్తువులను తయారుచేసి ప్రత్యక్షంగా చూపించి బోధిస్తే జీవితాంతం గుర్తు పెట్టుకుంటారనే ఆలోచనతో టీఎల్ఎం ద్వారా బోధనలు అందుబాటులో తీసుకొచ్చారు. టీఎల్ఎమ్ ద్వారా ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా, మనో వికాసానికి దోహదం చేసేలా ఈ బోధనలు సాగుతున్నాయి. విద్యాబోధనలో ఉపాధ్యాయుడు విషయాలను చెప్పడం, విద్యార్థులు వినడం ప్రక్రియ కంటే ప్రత్యక్షానుభవం ద్వారా నేర్చుకున్న దాన్ని దీర్ఘకాలం బాలబాలికలు గుర్తుంచుకుంటారు. విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే విధంగా టీఎల్ఎం ద్వారా అందించే విద్యాబోధన ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాఠ్యాంశాలకు అనువైన టీఎల్ఎం లను తయారు చేస్తూ విద్యార్థుల్లో ఆసక్తిని ఉపాధ్యాయులు పెంపొందిస్తున్నారు.అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వారి ఆలోచనలతో టీఎల్ఎంలను తయారు చేస్తూ విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తూ ఉపాధ్యాయులు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. టీఎల్ఎం (బోధనాభ్యసన సామగ్రి) అనేది బోధనాభ్యసన ప్రక్రియలో అతి ముఖ్యమైన అంశం. ప్రాథమిక స్థాయిలో కాస్ట్, నో కాస్ట్ ద్వారా పిల్లలను తరగతి గదిలోకి ఆకర్షించే విధంగా టీఎల్ఎంను ఉపాధ్యాయులు తయారు చేస్తున్నారు. సహజంగా పిల్లలు రంగుల పట్ల ఆసక్తిని చూపుతారు. టీఎల్ఎంను రంగులతో ఆకర్షణీయంగా తయారు చేయడం ద్వారా పిల్లలు ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొంటున్నారు. సహజంగా పిల్లలు చెప్పిన విషయాలు కొంతమేర గుర్తుంచుకుంటారు. పరిసరాలను చూడటం ద్వారా మరి కొంత అవగాహన కల్పించుకుంటారు. అదే ఒక నమూనాను ఉపయోగించి పాఠ్యాంశాన్ని బోధించడం ద్వారా పిల్లలు నేర్చుకున్న విషయాన్ని ఎప్పటికీ మర్చిపోరని ఉపాధ్యాయులు చెప్తున్నారు. దానికనుగుణంగా ఉపాధ్యాయులు టీఎల్ఎంను పరిసరాల్లో లభించేవాటితో తక్కువ ఖర్చుతో తయారు చేసి బోధనాభ్యసన ప్రక్రియలో సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా విద్యార్థినీవిద్యార్థుల నుంచి ఆశించిన సామర్థ్యాలను సాధించగలుగుతున్నామని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తరగతిలో సబ్జెక్టులో ప్రతి పాఠ్యాంశానికి అవసరమైన టీఎల్ఎంను ముందుగా తయారు చేసుకోవడం వాటిని ఉపయోగించి కృత్యములను తయారు చేసుకొని బోధనలు చేయడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు. తరగతి గదిలో చదువుపై విద్యార్థులకు ఆసక్తికలిగేలా ఉపాధ్యాయులు ప్రాధాన్యతనిస్తున్నారు. దీని ద్వారా చదువుల వెనుకంజులో ఉన్న విద్యార్థులకు పాఠాలు తేలిగ్గా అర్థమై ముందంజ వేసేందుకు సహాయపడుతున్నాయి. నేటితరం విద్యార్థులకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేలా బొమ్మలు తయారు చేస్తూ, విద్యార్థులకు వివరిస్తున్నారు. విద్యార్థులు ఇంతకుముందు చూడని వస్తువులను, చారిత్రాత్మక కట్టడాలను మన పూర్వీకులు వాడిన వస్తువులను బొమ్మల రూపంలో తయారుచేసి విద్యార్థులకు చరిత్రను తెలియజేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్ష సప్త కార్యక్రమంలోనూ ఏడు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో టీఎల్ఎం సహిత బోధనకు ప్రాధాన్యతనిచ్చారు.

టీఎల్ఎం బోధనతో విద్యార్థులకు మేలు



టీఎల్ఎం బోధనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ తరహా బోధనకు విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు. నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఉత్సాహంగా ఉన్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠ్యాంశాలకు అనుకూలమైన టీఎల్ఎంలు తయారుచేస్తున్నారు. టీఎల్ఎంతో విద్యాబోధన అందించడం ద్వారా విద్యార్థుల నుంచి ఆశించిన ఫలితాలు వస్తున్నాయి.

-ఎంఈఓ. రవీంద్ర

పిల్లల మనస్సుకు హత్తుకునేలా బోధన



చిన్నారుల మనస్సులకు హత్తుకునేలా టీఎల్ఎంతో బోధనాభ్యసన ప్రక్రియను కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు పాఠాలు తేలికగా అర్థమయ్యే విధంగా అవసరమైన వస్తువులను, బొమ్మలు, చార్టులు తయారుచేసి విద్యా బోధన చేస్తున్నాం. పిల్లలకు ఉపన్యాస రూపంలో పాఠాలు బోధించడం కన్నా వాళ్లకు వస్తువు రూపంలో చూపుతూ వివరిస్తే ఆ అంశం వెంటనే వారి మనస్సుకు హత్తుకుపోతుంది.

- టీఆర్‌కే స్వామి, ఉపాధ్యాయులు సీసలి స్పెషల్ పాఠశాల

నూతన ఆవిష్కరణల్లో నిమగ్నమవ్వాలి



మాట్లాడుతున్న కరేన్ బీత్ బహాన్

భీమవరం: ఫార్మాసిస్టులు నూతన యాంటిబయోటిక్స్ రాపిడ్ డయోగ్నొస్టిక్ టెస్ట్స్ వంటి ఆవిష్కరణల్లో నిమగ్నమవ్వాలని, యాంటిబయోటిక్స్ వాడుకలో తీసుకోవాల్సి జాగ్రత్తలను నేర్పించాలని యూఎస్ఏకు చెందిన స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ కరేన్ బీత్‌బహాన్ అన్నారు. సోమవారం భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. అమెరికాలో దాదాపు 50 శాతం యాంటిబయోటిక్ మందులు అనవసరంగా వైద్యులు వాడిస్తున్నారని, దీని వల్ల అనేక అనర్థాలున్నాయన్నారు. భారతదేశంలో కూడా ప్రభుత్వం యాంటిబయోటిక్స్ వాడకంపై చర్యలు చేపట్టిందని, దీనికి ఫార్మాసిస్టుల కీలకపాత్ర పోషించాలని సూచించారు. బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులకు ఔషధ పరిశోధన రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కరేన్ బీత్‌బహాన్ వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ నటరాజ్, అల్లూరి రమేష్, క్యాంపస్ డైరెక్టర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ


వీరవాసరంలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం



విద్యాసామగ్రి అందిస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక ఎస్వీఎస్ అండ్ వీఈసీ గవర్నమెంట్ జూనియర్ కళాశాల, రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులంతా చక్కటి విద్యాభ్యాసంతో జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేయాలని సూచించారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులందరికీ పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, జెడ్పీటీసీ గుండా జై ప్రకాష్, సర్పంచ్ గెద్దం భారతి, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, కానుకొలను శ్రీనివాస్, కాయల వీరస్వామి, అంగర వేణు, కేవీడీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

భీమవరం: సత్కారో పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని పలు మునిసిపల్ స్కూల్స్ విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రి అందజేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎం) గరల్స్ హై స్కూల్, గునుపూడి శ్రీ ఉమాసోమేశ్వర మున్సిపల్ హైస్కూల్, ఏఎస్సార్ నగర్‌లోని జాన్సీలక్ష్మీబాయి మున్సిపల్ గరల్స్ హై స్కూల్, చినరంగనిపాలెం పస్తులసాగరం మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు సుమారు రూ.1.50 లక్షల విలువైన కంపాస్ బాక్స్‌లు, అట్లాస్ బుక్స్, క్రీడా సామగ్రి, చాక్లెట్స్ అందజేశారు. అనంతరం ఆన్‌లైన్, మొబైల్, వీడియో గేమ్స్‌లో పాల్గొనడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మిర్తిపాటి గున్నేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పింగళి శ్రీకరి, కొమ్మాలపాటి నిహిత, ఇనపకోళ్ల ఇందిర, ఉపాధ్యాయులు వారణాశి రాధాకృష్ణ కె.మాధవీలత, ఎంకేఎస్ఎస్ మహాలక్ష్మి, అన్నా మణి, చిట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం

ఆకివీడు: తల్లీ బిడ్డల మధ్య అనుబంధాన్ని పెంపొందించడంలో తల్లిపాల పాత్ర ఎనలేనిదని సీడీపీఓ వి.వాణీ విజయరత్నం చెప్పారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సోమవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లీ తన బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమన్నారు. దీంతో పిల్లలు ఎదిగే కొద్దీ అనారోగ్యం , అలర్జీలు, ఊబకాయం వంటివి రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యురాలు అజ్మీనా నజిరిన్ మాట్లాడుతూ తల్లిపాల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. తల్లిపాల ఆవశ్యకతను అందరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం 16 మంది గర్భిణులకు సీమంతం చేశారు.

గర్భిణులకు సామూహిక సీమంతం


గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: తల్లులు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. భీమవరంలోని అంగన్‌వాడీ కేంద్ర కార్యాలయంలో భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రూరల్, అర్బన్ గర్భిణులకు శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ బిడ్డ జన్మించిన గంటలోపే తల్లి ముర్రుపాలు బిడ్డకు పట్టించాలన్నారు. తల్లి పాలలో కామెర్లు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

'అయోధ్య' రామ ధనుస్సుకు పూజలు


పూజలందుకున్న రామకోదండం

భీమవరం(ప్రకాశం చౌక్): అయోధ్యలోని రామ మందిరం పై భాగంలో నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయంలోని కోదండ రామునికి అలంకరించే నిమిత్తం 13 కిలోల వెండి, కిలో బంగారంతో తయారుచేసిన రామ దనస్సు, బాణాం భక్తుల దర్శనం నిమిత్తం పట్టణానికి వచ్చాయి. శ్రీరాంపురంలోని లెక్చరర్స్ వీధిలోని పురిఘళ్ల వెంకటరమణ మూర్తి స్వగృహానికి చేరుకున్నాయి. వీటిని తయారు చేయించిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో వాటికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వాటిని దర్శించు కుని భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యేవరకు దేశంలోని పలు ప్రాంతాలల్లో భక్తుల దర్శనానికి ఉంచుతామని తెలిపారు. త్వరలో మరోసారి ఈ ప్రాంతానికి రామ ధనస్సు, బాణం తీసుకొస్తామని తెలిపారు.

10 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

పాలకోడేరు: పాలకోడేరు దాడి ఘటనపై పది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్ సోమవారం తెలిపారు. డీఎస్పీ జయసూర్య విచారణ చేపట్టారని తెలిపారు. గ్రామంలో రెండు చోట్ల ఏర్పాటుచేసిన పోలీస్ పికెట్ కొనసాగుతాయని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయమైన సుగుణ కుమార్ (20) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. భీమవరానికి చెందిన సుగుణ కుమార్ ఆకివీడు వాహనంపై వస్తుండగా భీమవరం వైపు వెళ్లుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమై, కాలువిరిగిన కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

భీమవరం: భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్లబ్ గదిలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్సై సీహెచ్‌వి రమేష్ తెలిపారు. వారి నుంచి రూ.1.05 లక్షల స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

పంట బోదె ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న రైతులు

కాళ్ల: తమ పొలాలకు సాగునీరు అందించే పంట బోదెను ఆక్రమణల చెర నుంచి కాపాడాలని కోరుతూ బొండాడ, బొండాడపేట రైతులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ఈ.నాగార్జునకు ఫిర్యాదు చేశారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలోని పంటకాలవ నుంచి బొండాడపేటలోని మొగదిండి డ్రెయిన్ వరకు గ్రామంలో సుమారు 300 ఎకరాల భూమిని 60 మంది రైతులు సాగు చేసుకుంటున్నామన్నారు. పొలాలకు సాగునీరందించే పంట బోదె పూర్తిగా ఆక్రమణకు గురైందన్నారు. 6, 7 ఏళ్ల నుంచి సార్వా, దాళ్వా పంటలు సరిగా పండక చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ పంట బోదెను ఆక్రమించి సుమారు 25 మంది గృహాలు నిర్మించుకోవటమే కాకుండా ఆయా ఇళ్ల నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు నేరుగా బోదెలోకి వదలడం వల్ల చేలు బీడు బారిన పడుతున్నాయని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణకు గురైన పంట బోదెను ప్రక్షాళన చేసి పంట పొలాలను ముంపు వారి నుంచి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడ్ల సురేంద్ర, మందపాటి ప్రవీణ్, గుడ్ల సతీష్, చింతలపాటి సీతారామరాజు పాల్గొన్నారు.